క్లుప్తంగా

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి



హెచ్ఎంల సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి కృపావరం

దెందులూరు: మండలంలో అన్ని పాఠశాలల్లో నాడు-నేడు మన బడి పనులు ఈ నెల 31లోపు విధిగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.కృపావరం అన్నారు. శుక్రవారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ అన్నమ్మ అధ్యక్షతన అన్ని పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రత్యేకాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు తొలిప్రాధాన్యతిస్తోందని, ప్రాధాన్యతను గుర్తించి హెచ్ఎంలు లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలన్నారు. రోజువారీ ప్రగతిని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు.

ఎస్టీ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ కేటాయింపుపై హర్షం

దెందులూరు: ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ కుంభా రవిబాబు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇచ్చినందుకు గాలాయగూడెం బీఎస్ఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో బీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బండి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, ఎస్టీ సామాజిక వర్గ ప్రతినిధులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనులను ఆర్థికంగా, సామాజికంగా గుర్తిస్తూ, గౌరవిస్తూ ప్రోత్సహిస్తున్నారని ట్రెజరర్ కందుల రాజు హర్షం వ్యక్తం చేశారు. గిరిజనులంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు.

దెందులూరు గ్రామ కార్యదర్శిగా వీఎస్ చౌదరి

దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా వీఎస్ చౌదరి నియమితులయ్యారు. శుక్రవారం దెందులూరు ఎంపీడీఓ ఏబీపీ లక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందచేశారు. దెందులూరు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన కార్యదర్శి చౌదరి అన్నారు.

రహదారి సమస్య పరిష్కారం

దెందులూరు: దెందులూరు- అలుగులగూడెం రైల్వే అండర్‌పాస్ వద్ద రైల్వే కాంట్రాక్టర్ ప్రయాణికుల సౌకర్యార్థం రోడ్డు ఏర్పాటు చేయడంతో ఆరు గ్రామాల ప్రజలకు సమస్య తొలగింది. నాలుగు నెలలుగా ప్రయానికులు పడుతున్న ఇబ్బందిని వైఎస్సార్ సీపీ నాయకులు డీ. శ్రీను, వార్డు మెంబర్ ప్రసన్నరాణి రవి గ్రామస్తులు రైల్వే కాంట్రాక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆరు గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఇబ్బందిలేకుండా రహదారి నిర్మించడంపై ఆరు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నామినేషన్లు సక్రమమే

భీమడోలు: పోలసానిపల్లి గ్రామ పంచాయతీకి 12వ వార్డు సభ్యుని ఉప ఎన్నికకు వేసిన ఐదు నామినేషన్లు పరిశీలన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉప ఎన్నికకు అభ్యర్థులు వేసిన ఐదు నామినేషన్లను స్టేజ్ వన్ అధికారిణి జీవన సంధ్య పరిశీలించారు. నామినేషన్లు సక్రమమేనని ఆమె పేర్కొన్నారు. బొద్దాని ప్రసాద్, బొద్దాని పెద్దిరాజు, పాముల ధనలక్ష్మీ, గారపాటి రాజు, చల్లకోటి ప్రసాద్‌లు ఎన్నికల బరిలో ఉన్నారు. నోటీస్ బోర్డులో అభ్యర్థుల వివరాలను ఉంచారు. ఈనెల 14న నామినేషన్ల ఉపసంహరణ పూర్తవుతుందని, అనంతరం అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎస్.ఠాగూర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చేబ్రోలులో 'గడపగడపకు'

ఉంగుటూరు: చేబ్రోలు గ్రామంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉంగుటూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని ఆయన తెలిపారు. నాయకులు, ప్రజాప్రతినిధులు అధికార్లు పాల్గొనాలని ఆయన కోరారు.

కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిశీలన

పెదపాడు: విద్యార్థులు ఇష్టంతో చదవాలని తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని పెదపాడు ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. పెదపాడు మండలంలోని కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థుల చదువుల స్థాయిని పరిశీలించారు. ప్రోగ్రెస్ కార్డులు పరిశీలించి ఏ సబ్జెక్టుల్లో వెనుకబడతున్నారో చూసి వారికి ప్రత్యేక బోధన అందించాలని సూచించారు.

ప్రకృతిని కాపాడుకుందాం

గణపవరం: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని ఈవోపీఆర్డీ సత్యనారాయణ అన్నారు. నా భూమి- నా దేశం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొందేపాడులో 90 కొబ్బరి మొక్కలు నాటినట్టు ఉపసర్పంచ్ శీతాలం పుల్లయ్యనాయుడు తెలిపారు.

బడుగు, బలహీన వర్గాల పక్షపాతి సీఎం జగన్

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- రావులపర్రులో గడపగడపకు మన ప్రభుత్వం



రావులపర్రులో పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: బడుగు బలహీన వర్గాల పక్షపాతి సీఎం వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం రావులపర్రులో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేశారు. ఏ ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. శనివారం రాష్ట్రంలో మహిళలకు సున్నా వడ్డీ కింద రూ.4,969 కోట్లు అందించినట్టు తెలిపారు. ఇచ్చిన మాట కోసం సీఎం జగన్ మహిళలకు సున్నా వడ్డీ అమలు చేస్తున్న విషయాన్ని గ్రహించాలని కోరారు. బలహీన వర్గాల కోసం ఇళ్ల నిర్మాణాలు భారీస్థాయిలో చేపట్టామని అన్నారు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, సర్పంచి పైడి వెంకటరమణ, గ్రామ నాయకుడు గాది వెంకటరమణ, మహిళా విభాగం అధ్యక్షురాలు మంద జయలక్ష్మి, ఈవోపీఆర్డీ షంషుద్దీన్ పాల్గొన్నారు.

చేబ్రోలు కాలనీ పరిశీలన

ఉంగుటూరు: సీఎం జగన్ చేతులు మీదుగా పర్చువల్ విధానంలో చేబ్రోలు జగనన్న ఇళ్ల కాలనీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కలెక్టరు ప్రసన్న వెంకటేష్ చేబ్రోలు కాలనీని జిల్లాలో ఎంపిక చేసినట్లు సమాచారం. దాంతో గురువారం చేబ్రోలు కాలనీని ఎమ్మెల్యే వాసుబాబు, హౌసింగు ఇన్‌ఛార్జి పీడీ విజయరాజు, హౌసింగు అధికార్లు డీఈ సోమేశ్వరరావు, ఏఈ సురేష్ బాబు, ఎంపీపీ గంట శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, మండల కన్వీనర్ మరడ మంగరావు, నాయకులు యలిశెట్టి పాపారావు బాబ్జి, కరణం బుజ్జి, ఆకులరాజు పరిశీలించారు. కాలనీలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కాలనీలో రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

జగనన్న పాలనను ఆశీర్వదించండి

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



రామశింగవరంలో ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఎంపీపీ తాతా రమ్య

పెదవేగి : పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో తిరిగి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం రామశింగవరంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఎంపీపీ తాతా రమ్యలతో కలిసి రామశింగవరం సచివాలయ పరిధిలోని ప్రతి గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన పథకాలను, వారు అందుకున్న లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కామిరెడ్డి నాని, రాచపల్లి గంగాధరరావు, పసుమర్తి మహీంద్ర, సీతాల దాసు, అద్దేపల్లి రాంబాబు, రాచపల్లి రాంబాబు, చింతపల్లి నాగరాజు, వెన్నవెల్లి రవి, గోపిశెట్టి శ్రీను, గోపిశెట్టి రాజు, రాట్నాలమ్మ దేవస్థాన చైర్మన్ చళ్లగొళ్ళ వెంకటేశ్వరరావు, కామిరెడ్డి నాని, గోపిశెట్టి రాధమ్మ, జిల్లా నాగరాజు, బైపా ఆదాం, కంటిపూడి ధర్మరాజులు, ఆళ్ళ బాబి, యలమర్తి జయరాజు, జిల్లా వెంకటేష్, జమ్మిశెట్టి ఆంజనేయులు, సిదర్ల వరబాబు, చిలుకూరి సుబ్బారావు, షేక్ మాబు, కట్టా ఏసుబాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు సభ్యులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఆరోగ్యం సాగు, తాగునీరు, నాడు-నేడు, రైతు సమస్యలతోపాటు ప్రజలందరి సమస్యలు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వినతిపత్రాలు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులకు సిఫార్సు చేశారు. ఆరోగ్యం, వైద్యసేవలు సమస్యలను ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది వివరాలు నమోదు చేసుకోవాలని ఆరోగ్యశ్రీ ఇన్‌ఛార్జి ప్రసాద్‌కు సూచించారు.

నాన్ గెజిటెడ్ ఆఫీసర్ రాష్ట్ర సదస్సుకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

దెందులూరు: విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి నిర్వాహకులు ఆహ్వానాన్ని అందజేశారు. రాష్ట్ర సదస్సుకు విధిగా వస్తానని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నాయకులతో అన్నారు.

మహిళల అభివృద్ధికి పథకాలు దోహదం

పెదవేగి : మహిళల అభివృద్ధికై ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దోహదం చేస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం వచ్చిన నాటి నుంచి మహిళల ఆర్థిక స్వావలంబ దిశగా, కుటుంబ పరంగా, సామాజికంగా అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి బాటలో నిలిపేందుకు చేస్తున్న కృషి దేశానికి ఆదర్శనీయమని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ గత ప్రభుత్వం 2016 అక్టోబర్‌లో డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం నిలుపుదల చేసిందని తెలిపారు. మహిళలు పాదయాత్రలో జగనన్నకు విన్నవించడంతో అధికారంలోకి వచ్చాక ఏటా వడ్డీ రాయితీ నేరుగా మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం అమలాపురంలో నాలుగో విడత బటన్ నొక్కి మహిళలకు నగదు జమ చేశారని అబ్బయ్యచౌదరి పేర్కొన్నారు. ఈ మేరకు దెందులూరు నియోజకవర్గ వ్యాప్తంగా 6,408 డ్వాక్రా సంఘాల రూ.849.58 లక్షల నగదును మహిళలకు అందించనున్నామని ఎమ్మెల్యే వివరించారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ రాష్ట్ర బృందం సభ్యుడు

గణపవరం: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్ది ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బాటలు వేయాలని స్వచ్ఛ సర్వేక్షన్ రాష్ట్ర బృందం సూచించింది. బృందం సభ్యుడు అజయ్ నేతృత్వంలో స్వచ్ఛ సర్వేక్షన్ టీం సభ్యులు శుక్రవారం గణపవరం మండలం గణపవరం, మొయ్యేరులో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మరుగుదొడ్ల వినియోగం, చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ తదితర కార్యక్రమాలను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించుకునేలా చైతన్యం కలిగించాలని, బహిరంగ మలమూత్ర విసర్జనను పూర్తిగా నిర్మూలించాలని ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచించారు. టీం సభ్యులు ఎడ్వర్డ్, రత్నాకర్‌లు పాల్గొన్నారు. గణపవరం, మొయ్యేరులో స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిర్మయి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, గణపవరం, మొయ్యేరు సర్పంచ్‌లు మూర అలంకారం, దుళ్ల కుటుంబరావు, పంచాయతీ కార్యదర్శులు డి.శివరామ్‌ప్రసాద్, ఎం.అప్పారావు ఆయా గ్రామ పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

14న కొబ్బరి రైతుల చలో కలెక్టరేట్



కొబ్బరి రైతుల చలో కలెక్టరేట్ ధర్నాకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు నాయకులు

పెదవేగి : కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న ఉదయం 10 గంటలకు కొబ్బరి రైతుల చలో కలెక్టరేట్ ధర్నా, కలెక్టర్‌కు రాయబారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం కార్యదర్శి బొల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి శుక్రవారం చెప్పారు. మండలంలోని విజయరాయిలోని ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం యార్డు వద్ద చలో కలెక్టరేట్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొబ్బరికాయలకు కనీస ధరలు రాక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు.

జిల్లాలో 20 వేల మొక్కల పంపిణీ

దెందులూరు: జిల్లాలో 12 రకాల మొక్కలు 20 వేలు పంపిణీ చేశామని లయన్స్‌క్లబ్ జిల్లా సెక్రటరీ చుక్కా అవినాష్ రాజు అన్నారు. శుక్రవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ మామిడి, సపోటా, జామ, నేరేడు, కొబ్బరి, అరటి, సీతాఫలం, నిమ్మలతోపాటు పలు రకాల మొక్కలను జిల్లాలో విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామాల రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేయడానికి లయన్స్ క్లబ్, స్వచ్ఛంద సంస్థలు, రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఏజెన్సీ నాయకులు, ప్రజాప్రతినిధులు అందరి సహాయ సహకారాలతో పంపిణీ చేశామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల కల్పన ముడిపడి ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. మొక్కలు నాటిన ప్రతి ఒక్కరూ వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లాను గ్రీన్ జిల్లాగా మార్చేందుకు లయన్స్ క్లబ్ ప్రణాళికాబద్ధంగా మొక్కలు పంపిణీ, రక్షణ , ఏర్పాటు కార్యక్రమం చేస్తుందన్నారు.

ఎన్నారై ఫాదర్ల అభినందన

ఏలూరు జిల్లాను గ్రీన్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు లయన్స్ క్లబ్ సేవలను వెబ్‌సైట్‌లో చూసిన ఇంగ్లాండ్‌లోని ఫాదర్ డొమినిక్ స్టాల్లియో అభినందించారని అవినాష్ అన్నారు. గ్రీన్ ఏలూరు జిల్లాకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎన్నారై ఫాదర్ చెప్పారని వివరించారు.

చక్కటి నడవడికతో ఆదర్శవంతమైన జీవితం

పెదవేగి : చక్కటి నడవడికతో ఆదర్శవంతమైన జీవితం గడపవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి రాజేశ్వరి చెప్పారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో దుగ్గిరాల్లోని ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యానికి, ప్రొఫెసర్లకు, సిబ్బంది, విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి రాజేశ్వరి మాట్లాడుతూ ర్యాగింగ్ కమిటీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ మాట్లాడుతూ ర్యాగింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. లోక్ అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి న్యాయ సేవా సదన్ భవనం జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సంబంధించిన ప్యానల్ లాయర్లకు, వలంటీర్లకు అడ్వకేట్ గుమస్తాలకు వివిధ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్పర్సన్ జి. మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి రాజేశ్వరి మాట్లాడుతూ సెప్టెంబర్ 9న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యాంటీ ర్యాగింగ్ కమిటీ మెంబర్లు కూనా కృష్ణారావు, డాక్టర్ సీహెచ్. వంశీకృష్ణ, ఎల్. వెంకటేశ్వరరావు, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణ పాల్గొన్నారు.

నా భూమి.. నా దేశం శిలాఫలకాల ఆవిష్కరణ



ఎస్ కొత్తపల్లిలో శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఏఓ వానపల్లి ప్రదీప్‌కుమార్

పెదపాడు: ప్రతి వ్యక్తిలో దేశభక్తితోపాటు బాధ్యతాయుతంగా మెలగాలనే సదుద్దేశ్యంతో నా భూమి.. నా దేశం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని ఎస్ కొత్తపల్లిలో శుక్రవారం నా భూమి..నా దేశం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దీపాలను వెలిగించి ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేపేని రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో సర్పంచ్ కడిమి పద్మావతి ఆధ్వర్యంలో నా భూమి.. నా దేశం కార్యక్రమం శుక్రవారం నిర్వహించి ప్రతిజ్ఞ చేసారు. నా భూమి.. నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంకితం చేసి నేలతల్లికి నమస్కారం- వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యకరమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కడిమిగోవిందరావు, బాల్ద ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రామారావుగూడెంలో..

దెందులూరు: రామారావుగూడెంలో నా భూమి... నా దేశం శిలాఫలకాన్ని సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, గ్రామ కార్యదర్శి సీహెచ్ చౌదరి, ఉపసర్పంచ్ కస్సే శ్రీనివాసరావు తదితరులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్ధ శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు



కళాశాల వద్ద పైలాన్ నిర్మాణం, ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు

ఉంగుటూరు: నారాయణపురం అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్ధ శతాబ్ది ఉత్సవాలకు వేదిక తయారయ్యింది. శని, ఆదివారాలు రెండురోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలాభాస్కర్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. సాయంత్రం 4గంటలకు గోల్డెన్‌జూబ్లీ ఉత్సవాలు ప్రారంభిస్తారు. అనంతరం పైలాన్‌ను, అరవిందుడు, గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొంటారు. పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఈపూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బొమ్మిడి అప్పారావు, ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు ఆధ్వర్యం వహించనున్నారు. నారాయణపురంలో విద్యాదాత చింతలపాటి మూర్తిరాజు 1972లో ఈ కళాశాలను ఏర్పాటు చేశారు. ఆదివారం నిర్వహించే కార్యక్రమంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే వాసుబాబు, పూర్వ విద్యార్థులు పాల్గొంటారు.

సమస్యలపై వినతిపత్రం అందజేత

భీమడోలు: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలోని పని చేస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ జీతాలు ఇవ్వాలని శుక్రవారం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బూడిది రాజశేఖర్‌కు వినతి పత్రం అందించారు. భీమడోలులోని సాలిడ్ వెల్త్ రిసోర్స్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ తరుణంలో వివిధ సంఘాల నాయకులు తమ సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందించారు. 2020 జూలైలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని పంచాయతీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బంది రెగ్యులర్ చేశారని, ఇప్పటి వరకు రెగ్యులర్ వేతనాలు ఇవ్వడం లేదని వారు తెలిపారు. అదే విధంగా గ్రామ సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు బీఎల్‌వో బాధ్యతల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. జిల్లా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ అధ్యక్షుడు తేజ, అరుణ్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరి సహకారం అవసరం

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



పెదవేగి మండల పరిషత్ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం ఎంతో అవసరమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శుక్రవారం పెదవేగి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా సమావేశాన్ని ప్రారంభించిన ఎంపీడీఓ రాజ్‌మనోజ్ నీటి ఎద్దడి నివారణకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. 28,137 సర్టిఫికెట్లు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించామని చెప్పారు. రూ.1,54,34,000 అభివృద్ధి పనులు గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ద్వారా గుర్తించి పూర్తి చేశామని చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు నడిపించేందుకు అన్ని చర్యలు చేపట్టారని ఆయన అన్నారు. మండల పరిధిలోని అన్ని ప్రధాన రోడ్లను అభివృద్ధి చేశామని అన్నారు. పెదవేగి మండలంలో 2,281 జగనన్న ఇల్లు నిర్మించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, జగనన్న లే ఔట్‌లో శిలా ఫలకం లేదా ఆర్చ్ తప్పనిసరిగా నిర్మించాలని అన్నారు. మండలానికి 6 వేల ఇళ్లు మంజూరు చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అమ్మపాలెంలో జగనన్న లే ఔట్ మేరక చేయాలని సర్పంచ్ కోరారు. తాళ్ల గోకవరంలో తాగునీటి సమస్యను సర్పంచ్ నెక్కలపూడి సురేష్ తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి తాళ్ల గోకవరానికి రెండు కొత్త మోటార్లు మంజూరు చేస్తానని చెప్పారు. గోపన్నపాలెం-రామసింగవరం రోడ్డు పనులు త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అన్నారు. కొప్పాక జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం వివాదాన్ని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మండలంలో 37 జెడ్పీ రహదారుల అభివృద్ధి చేయాల్సి ఉండగా ఇప్పటికే 25 రహదారుల పనులు పూర్తి చేసినట్టు ఎంపీపీ తాతా రమ్య తెలిపారు. ఎంఈఓ బుధ వ్యాస్, సర్పంచ్ కోటేశ్వరరావు పలు సమస్యలు సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడికొండ ఉమాదేవి, పెదవేగి సొసైటీ అధ్యక్షులు పెనుమాక వెంకట సుబ్బారావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మెట్లపల్లి సూరిబాబు, శ్రీ రాట్నాలమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ చల్లగోల్ల వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మేక లక్ష్మణరావు మండల పరిషత్ అధికారి జీఆర్ మనోజ్, పరిపాలనాధికారి కే విక్టర్ జాన్సన్ వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.